ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.14.02.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వ్యవసాయ రంగంలతో సంబంధమున్న ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ ను ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.
2. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపలి భాగం మొత్తాన్నీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసి, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు
3. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగిసిన తర్వాత మొత్తం 90 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది.
4. ములుగు జిల్లాలో మేడారం చిన్న జాతర ఘనంగా జరుగుతోంది. భారీ సంఖ్యలో భక్తులు వన దేవతలను దర్శించుకుంటున్నారు.

---------------------

**భట్టి విక్రమార్క-నాబార్డ్**

వ్యవసాయ రంగానికి సంబంధించిన భాగస్వాములు, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ ను ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి రైతులను జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ నాబార్డు, బ్యాంకర్లు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. నాబార్డ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పరపతి సదస్సును ఈ రోజు హైదరాబాద్ లో భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిల్ ఫామ్ సాగుతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని స్వయం సహాయ సంఘాలు, రైతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితుల్లోనూ రాష్ట్ర రైతులు వ్యవసాయ రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారని ప్రశంసించారు. తమ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను, నీటి పారుదల రంగాన్ని ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందర్, నాబార్డ్ సీజీఎం ఉదయ భాస్కర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**(ఎంఎస్ఎం)**

-------------------

**జీహెచ్ఎంసీ-సీఎం రివ్యూ**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపలి భాగం మొత్తాన్నీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను ఆ ప్రాంతం అంతటా నిర్వహించాలన్నారు. నానక్‌రామ్‌గూడలోని హెచ్ ఎండీఏ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కోర్ అర్బన్ అభివృద్ధి అంశాలను ముఖ్యమంత్రి సమీక్షించారు. నగరంలో కొత్తగా మరో 7 ఫ్లైఓవర్లు నిర్మించాలన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**(పీఎస్)**

---------------------

**ఎమ్మెల్సీ-తుది జాబితా**

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మొత్తం 90 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు నిన్నటితో ముగియడంతో పోటీలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోగా.. 19

మంది పోటీలో మిగిలారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఒక అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకోగా 15 మంది పోటీలో ఉన్నారు. ఇదే నియోజకవర్గం పట్టభద్రుల స్థానానికి 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోగా 56 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని కరీంనగర్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేల సత్పతి తెలిపారు. ఈ మూడు స్థానాలకు ఈ నెల 27న తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

**(డెస్క్/ పిటిసి, కరీంనగర్, నల్గొండ )**

---------------------

**సంగారెడ్డి కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారం**

అధికారంలో ఉన్న పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ శాసన మండలిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలను తమ పార్టీలో చేర్చుకొని ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, ప్రజల గొంతు వినిపించకుండా చేసిందని అన్నారు. మెదక్-అదిలాబాద్- కరీంనగర్-నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి సి. అంజి రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య తరపున మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కిషన్ రెడ్డి ఈ రోజు సంగారెడ్డి పట్టణంలో ఈరోజు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల తో ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**(SANGAREDDY PTC)**

-------------------

**కాళేశ్వరం మాజీ ఎంపీ వినోద్ కుమార్**

పంట పొలాలకు కాళేశ్వరం నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మేడిగడ్డలో చిన్న లోపం తలెత్తితే దాన్ని మరమ్మత్తులు చేయించకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావును విమర్శించడాన్ని ప్రజలు హర్షించడం లేదన్నారు. ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని సముద్రం పాలు చేయకుండా ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.

**(పీటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)**

--------------------

**నల్లగొండ-ఎఫ్సీఐ**

దేశ ప్రజల ఆహార భద్రతకు భారత ఆహార సంస్థ-ఎఫ్ సీఐ గత 61 సంవత్సరాలుగా నిరంతరం పాటుపడుతోందని ఎఫ్ సీఐ నల్గొండ జిల్లా డివిజనల్ మేనేజర్ నవీన్ కుమార్ అన్నారు. ఎఫ్ సీఐ 61వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు తమ వృత్తి తో పాటు ఆట పాటల్లో కూడా చురుకుగా పాల్గొనాలని నవీన్ కుమార్ సూచించారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

---------------------

**మినీ మేడారం**

ములుగు జిల్లాలో 4 రోజుల మేడారం చిన్న జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మ వన దేవతల గద్దెల ప్రాంతాలు భక్తులతో కిటికిటలాడుతున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా భక్తులను గద్దెల ప్రాంతాలపైకి దేవాదాయ శాఖ అధికారులు అనుమతి ఇస్తుండడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 5 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారుల తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

(పిటిసి ములుగు జిల్లా)

---------------------------

**నిర్మల్ జిల్లా**

ఎంతో పేరు పొందిన నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమకు పొనికి కర్ర అందుబాటులో లేకపోవడంతో భవిష్యత్తులో ఈ పరిశ్రమ నడవడం ప్రశ్నార్థకమంతుందని గ్రహించి జిల్లా గ్రామీణ ఉపాధి హామీ అధికారి విజయలక్ష్మి ప్రత్యేక చొరవతో ఉత్తరాఖండ్ నుంచి ఐదువేల మొక్కలు తెప్పించి ఉపాధి హామీ నిధులతో జిల్లా వ్యాప్తంగా

వాటిని పెంచుతున్నారు. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి గోల సాయన్న కు వివరిస్తూ .....

-------------SOUND BYTE--------

**పిటిసి**

---------------------------

**ఎనుమాముల వ్యవసాయ మార్కెట్**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు రవికుమార్ తెలిపారు. ఇటీవల మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్ నేపథ్యంలో ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ లో పరిస్థితులను చక్కదిద్దడం పైన దృష్టి సారించినట్లు చెప్పారు. మార్కెట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త పిఓఎస్ యంత్రాలను కొద్ది రోజుల్లోనే అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

**(వరంగల్ జిల్లా పి టి సి )**

------------------------------

**ఆసిఫాబాద్- సింగరేణి సిఎండి పర్యటన**

ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటి కైరిగూడ ఉపరితల గనుల నిర్వహణపై సింగరేణి సిఎండి బలరాం నాయక్ సంత్రుప్తి వ్యక్తం చేశారు. రెండు

రోజుల గనుల పర్యటనలో భాగంగా నిన్న రాత్రి డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ తో కలిసి గనులను పరిశీలించి వారితో సమావేశం నిర్వహించారు. కార్మికుల సంక్షేమంతో పాటు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు నాణ్యమైన సేవలు అందించాలన్నారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

-----------------------

**సిరిసిల్ల-సహకార సంఘం**

రాజన్న  సిరిసిల్ల జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గ పదవీకాలం నేటితో ముగియనుంది.జిల్లాలోని మొత్తం 24 సంఘాల్లో 74 వేల728 మంది సభ్యు లుండగా.. 35 వేల 776 మందికి ఓటు హక్కు ఉంది. ఒక్కో సహకార సంఘంలో 13 డైరెక్టర్ స్థానాలున్నాయి.

**(పిటిసి,  రాజన్న సిరిసిల్ల)**

---------------------

**ఆసిఫాబాద్ -ఆస్తి పన్నులు వసూలు**

ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీల పరిధిలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజన్న సమీక్షలో మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పన్నులను వెంటనే వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలని తెలిపారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

-----------------------------

**యాదాద్రి-రాచకొండ సీపీ**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుదీర్ బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జోన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి ఇటీవల 10కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

(పీటీసీ,యాదాద్రి)

-------------------------------